# మానవత్వం

-చింతా లక్ష్మీ సుజాత

శివాలయం వచ్చి వెళ్ళే భక్తుల రద్దీతో హడావుడిగా ఉంది. అంత హడావుడిలోనూ కూడా ఓ బిచ్చగాడి అరుపు విరామం లేకుండా వినిపిస్తూనే ఉంది.

'అమ్మా... కాలు లేని కుంటోడ్ని తల్లీ.. ధర్మం చెయ్ తల్లీ' అంటూ.. అరుస్తున్న ఆ గొంతు సత్తిగాడిది. తన గొంతుతో తనకి సంబంధం లేదన్నట్లు యాంత్రికంగా అరుస్తూనే ఉన్నాడు. కాని, సత్తిగాడి మనసు మాత్రం ఆలోచనల సుడిగుండంలో పడి కొట్టుకుంటున్నది.

'ఏమయ్యా... ఇయ్యేలన్నా బిడ్డను డాకటరు కాడికి తీసుకపోతావా?' అని అడిగిన భార్య మాట గుర్తు వస్తుంది. దారిద్ర్యపు చిరుగుల నుండి ఒంటిని దాచుకోలేక అవస్థపడుతూనే, కూతురి ఆరోగ్యం గురించి తల్లడిల్లే భార్య మరీ మరీ జ్ఞాపకం వస్తోంది.

కేవలం పేదవాళ్ళకే రిజర్వ్ చేయబడ్డ ఆకలి జబ్బుతో కృంగిపోయి, అస్థిపంజరంలా మారి మంచాన్ని అంటిన కూతురి పరిస్థితి గుర్తు వస్తూనే సత్తిగాడిలో దుఃఖం తన్నుకు వస్తుంది. కన్నబిడ్డకి కనీసం మందులు కొనలేని తన స్థితిని చూస్తూ, దిగులుతో కృంగిపోతూనే.. 'ధర్మం చెయ్ తల్లీ' అని అరుస్తూనే ఉన్నాడు.

ఇంతలో అతని ముందున్న సత్తుగిన్నెలో మూడు నాణాలు పడ్డాయి. 'ధర్మ ప్రభువలంతా యిలా కనికరం చూపితే తన బిడ్డను బ్రతికించుకోగలనన్న' ఆశ పొంగింది సత్తిగాడిలో. మరింత ఉత్సాహంగా.. నాలుగు మెట్ల అవతల కూర్చుని అడుక్కుంటున్న రాజయ్యతో పోటీపడి మరీ అరుస్తున్నాడు..' ధర్మం చెయ్ తల్లీ.. ధర్మం' అని.

ఈతని వాలకం చూసి రాజయ్య 'ఒరే సత్తిగా, ఎందుకురా అట్టా అరుత్తావు? ఏసేవాళ్ళు ఆల్లే ఏత్తారు గానీ ఊరుకో' అని అన్నాడు.

సత్తిగాడు పుట్టగానే వాళ్ళ అమ్మ 'అన్నవరం సత్తింనారాయన సామే నా కడుపున పుట్టాడు' అంటూ మురిపెంగా పెట్టిన 'సత్యనారాయణ' పేరు క్రమంగా సత్తిగాడుగా మారింది. సత్తిగాడి తండ్రి కూడా గుడి దగ్గర బిచ్చమెత్తుకొనేవాడు. కాని, సత్తిగాడికి మాత్రం చిన్నతనం నుండే ముష్టి ఎత్తుకు బ్రతకటం అంటే ఇష్టం లేక చిన్న చిన్న కూలిపనులు చేసేవాడు. కష్టపడి వచ్చిన తన సంపాదనతో తాను బ్రతకగలనన్న ధైర్యం వచ్చాక పెళ్ళి కూడా చేసుకున్నాడు. తన రెక్కల కష్టంతో ఒద్దికగా కుటుంబాన్ని నడుపుకుంటున్న అతడ్ని 'విధి' నిర్దయగా వెక్కిరించింది. మూటలు మోస్తూ, పట్టు తప్పి క్రిందనున్న ఓ ట్రాలీపై పడి కాలు విరగటం, దెబ్బతిన్న కాలిని పూర్తిగా తొలగించటంతో.. అతను శాశ్వతంగా అవిటివాడుగా మారటం.. అన్నీ.. చాలా వేగంగా జరిగిపోయాయి. అయినా మనసు ఉగ్గబెట్టుకొని బ్రతుకు తెరువుకై ప్రయత్నిస్తే... ఇతని అవిటితనాన్ని చూసి 'పోరా కుంటోడివి.. నీకు పనేంటి?' అన్న ఛీత్కారాలే మిగిలాయి. భార్యా బిడ్డల్ని ఆకలి చావుకి గురిచేయలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో తన తండ్రి వదిలి వెళ్ళిన 'వృత్తి'నే ఆశ్రయించి.. యిలా గుడి మెట్ల మీద స్థిరపడ్డాడు.

గుడి మూసే సమయం అయ్యింది. భక్తులు పల్చబడ్డారు.

'ఏరా సత్తిగా, గుడి తలుపులు మూత్తన్నారుగా.. పోయి ఏదన్నా తిని సెంటరు కాడికి పోయి సాయంకాలం దాకా ఆడనే ఉందాం' అన్నాడు రాజయ్య తన మాటను సర్దుకుంటూ.

సత్తిగాడు తన గిన్నె వైపు చూసి నీరసపడ్డాడు. అందులో ఉన్న నాలుగు నాణాలు అతన్ని జాలిగా చూస్తున్నట్లు అన్పించింది. 'ఇయ్యేల కూడా నా బిడ్డ...' అన్న ఆలోచనతో అతని కళ్ళల్లో నీళ్ళు నిండిపోయాయి. సత్తిగాడి పరిస్థితిని చూసిన రాజయ్య చప్పున దగ్గరకు వచ్చి 'ఏటిరా.. ఏటయ్యింది? ఎందుకేడుత్తున్నావ్?' అని ఆత్రంగా అడుగుతుంటే, చుట్టూ ఉన్న మిత్రులంతా గబగబా తమ సరంజామా సర్దుకుని వచ్చి చుట్టూ చేరి ఏమిటంటూ అడగటం మొదలుపెట్టారు.

నిస్సహాయతతో బరువెక్కిన గుండెను ఉగ్గబట్టుకుని.. గొంతు పెగుల్చుకుని తన కూతురి పరిస్థితి వివరించాడు సత్తిగాడు. వినగానే అందరి గుండెలు ద్రవించాయి. ఈ పరిస్థితి నుండి ముందుగా తేరుకున్న రాజయ్య 'బాధపడక సత్తిగా.. మన బతుకులే యింత. అయినా మేమంతా లేమంటరా. అందరి కాడా ఉన్న

సిల్లర పోగేత్తే.. నీ అవసరం గడుసుద్ది' అని ఓదార్చి, తక్కిన వాళ్ళవైపు 'ఏమంటారు?' అన్నట్లు చూసాడు. గుంపులోని ఓ ముసలి బిచ్చగాడు సరేనన్నట్లు తలూపి 'రాజయ్యా, నీతో పాటే మేమూను. ఈడి అవుసరం కంటే ఈ సిల్లర గొప్పంట్రా?'' అంటూ అందరి దగ్గరా ఉన్న చిల్లర పోగేసి, జాగ్రత్తగా మూటగట్టి సత్తిగాడి చేతిలో పెట్టాడు.

రాజయ్య సత్తిగాడి భుజం తట్టి 'చూడు సత్తెం.. డబ్బు జాగరత్త. బేగెల్లి నీ బిడ్డని బతికించుకో. మరి మేము సెంటరు కాడికి ఎలతన్నాం' అని ధైర్యం చెప్పి, అందరూ సాగిపోయారు.

వాళ్ళందరూ చేస్తున్న సహాయానికి సత్తిగాడి మన సంతా కృతజ్ఞతతో నిండిపోయింది. ఆర్ద్రత నిండిన అతని కళ్ళకు దృశ్యాలన్నీ అల్లుకుపోయి కనిపిస్తు న్నాయి. అతని కర్తవ్యానికి కార్యరూపమిచ్చిన మిత్రు లంతా దూరంగా సాగిపోతుంటే.. భుజాన సంచి సవ రించుకుంటూ సత్తిగాడు పైకి లేచాడు. చిల్లర మూటను రొంటిన దోపుకొని 'తన బిడ్డను బ్రతికించుకోగలనన్న' ఆశతో కర్ర ఊతంతో బయలుదేరాడు.

రెండు అడుగులు వేసాడో.. లేదో.. హఠాత్తుగా నాలుగు రోడ్ల కూడలి నుండి ఓ కేక వినబడింది. కీచుమంటూ ఆగిన ఓ వ్యాను, చుట్టూ జనం గుంపు లుగా మూగటం చూసి 'ఏం జరిగినాదబ్బా' అను కుంటూ అటు కదిలాడు.

గుంపుగా చేరిన జనం మధ్యన దారి చేసుకుంటూ నడిచి, తొంగి చూసాడు. వ్యాను చక్రం పక్కనే రక్తపు మడుగులో ఎవరో పిల్ల అచేతనంగా పడి ఉంది. చూడగానే సత్తిగాడి గుండె పిండినట్లయింది. చుట్టూ జనం చేరి మాట్లాడుకుంటూనే ఉన్నారు.

'అరే.. ఎవరన్నా ఈ పిల్లను హాస్పటల్‌కు తీసుకు వెళ్ళండి..' ఓ ఖద్దరు మనిషి హుకుం జారీచేసాడు.

'చాల్లేండి.. ఎంతసేపు చూస్తారు? పదండి.. నా ఆఫీసుకు టైమ్ అవుతుంది' స్కూటర్‌పై కూర్చున్న భర్తను తొందరచేస్తూ ఓ ఉద్యోగిని మందలిస్తోంది.

'అంతా ఈశ్వరేచ్ఛ.. ఇంకా భూమ్మీద నూకలు రాసిపెట్టి ఉంటే బ్రతుకుతుంది' ఓ రుద్రాక్షధారి వేదాం తం చెప్తున్నాడు.

'పూర్ ఫెలో, లేబర్ లాగా ఉంది చూస్తుంటే. ట్రాఫిక్ రూల్స్ తెలిసుంటే ఈ ప్రమాదం జరిగేది కాదు' సూట్ వేసుకుని నీట్‌గా ఉన్న ఓ యువకుడు తన తెలివితేటలతో విశ్లేషిస్తున్నాడు.

'పోయినేడు.. నేను ఇదే రోడ్డులో వస్తుంటే..' అంటూ క్రితం సంవత్సరం తాను చూసిన యాక్సిడెంట్ గురించి వర్ణిస్తూ ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఉన్నాడు.

సత్తిగాడి గుండె వేగం పెరగసాగింది. ఆ అమ్మా యి పరిస్థితి అంతకంతకూ ఆందోళనగా ఉంది. జనం మాటలు వింటున్న సత్తిగాడికి అసహనంతో పాటు అసహ్యమేస్తూంది. ప్రక్కవాడిని పట్టించుకోలేని ఆధునిక జీవనశైలి, అవసరానికి చేయూతనివ్వక కబుర్లతో జాగారం చేసే మధ్య తరగతి డాంబిక ప్రవృత్తి సత్తిగాడి చిన్ని బుర్రకి అందలేదు.

అటుగా వస్తున్న ఓ ఆటోని ఆపి హడావుడిగా పోలీసులకి కబురందిస్తానంటూ వెళ్ళాడు ఓ సంఘ సంస్కర్త.

చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఆ పిల్ల ముఖం వైపు చూసాడు సత్తిగాడు. 'ఎవరో పాపం.. తన బిడ్డ ఈడుదే' జాలితో సత్తిగాడి మనసు నిండి పోయింది. 'ఎక్కువ సమయం లేనట్టుంది. ఆ పిల్ల పేనం ఏమైపోద్దో'.. సత్తిగాడు ఓ నిర్ణయానికి వచ్చి ఆ పిల్ల వైపు కదిలాడు. బరువైన చిల్లర మూట అతని కుంటి నడకకు అడ్డుపడింది. నిబ్బరంగా దాన్ని తడుముకున్నాడు.

'అవును... నా బిడ్డని బతికించుకోవటానికి యింకేదన్నా దారి చూసుకోవచ్చు. కాని, ఈ పిల్లకి అంత సమయం లేదాయె' అని మనసులో నిశ్చయించు కుని, ఆ పిల్లను అతి కష్టంమీద తన భుజాన వేసుకుని కుంటుతూ కదిలాడు సత్తిగాడు దగ్గరలో ఉన్న హాస్పిటల్ వైపు.

'ఓహ్.. ఈ పిల్ల ఆ ముష్టివాడి కూతురనుకుంటా. మరింతసేపు మాట్లాడదే' అని ఊపిరి పీల్చుకుని అక్కడ మూగిన జనమంతా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. రెండు నిముషాల్లోనే అసలు అక్కడ ఏమీ జరుగనంత అతి మామూలుగా ఎవరి పనులు వాళ్ళు చూసుకుం టున్నారు.

ఆ అమ్మాయిని భుజాన వేసుకున్న సత్తిగాడు ఆయాసపడుతూ హాస్పటల్ లోపలికి వచ్చి వరండాలో ఉన్న ఓ బల్లపై ఆ పిల్లను పడుకోబెట్టి 'డాకటరు బాబూ.. డాకటరు బాబూ' అని పిల్చుకుంటూ రూమ్ లోకి వచ్చాడు. అప్పటివరకూ పేషంట్స్‌ని చూసి విశ్రాం తిగా కూర్చున్న డాక్టర్‌గారు సత్తిగాడి వాలకాన్ని, అతని

చిరుగుల వేషాన్ని చూసి కొంచెం చిరాగ్గానే కనుబొమ్మ లెగరేసాడు ఏమిటన్నట్లు.

సత్తిగాడు ఆయాసపడుతూ సంగతంతా వివరించి, ఒక్కసారి బయటకు వచ్చి పిల్లను చూసి వెళ్ళమని బ్రతిమలాడటం మొదలుపెట్టాడు. తప్పదన్నట్లుగా లేచిన డాక్టర్ విసుగ్గానే ముఖం పెట్టి బయటకు వచ్చి దారిద్ర్యానికి ప్రతినిధిలా ఉన్న సత్తిగాడ్ని, రక్తపు బట్టలతో ఉన్న ఆ అమ్మాయిని చూసి 'యాక్సిడెంట్ కేసులు మేం చూడం. గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళు' అని చెప్పి వెనుతిరిగి రూమ్‌లోనికి వెళ్ళిపోయాడు.

'అంత మాట అనకండి బాబూ, ఇంకా ఆలీసమైతే ఈ పిల్ల బతకదేమో.. తమరే కాపాడాలి' అంటూ సత్తిగాడు చేసే విన్నపాలు డాక్టర్‌గారి రూమ్‌లోనికి వెళ్ళలేకపోతున్నాయి. అతనికి ఆవేదనతో గుండె పట్టేస్తుంది. నిస్సహాయత నిండిన అతని పరిస్థితి కళ్ళ నుండి ధారల రూపాన వర్షిస్తున్నది. 'ఏ తల్లి కన్నబిడ్డో.. పాపం.. ఏమవుతుందో?' అని నీరైపోతున్నాడు.

ఈతని ఏడుపులు వింటున్న కాంపౌండర్ వచ్చి 'ఏంరా? డబ్బులేని మీక్కూడా మా హాస్పటలే కావాలా? గవర్నమెంట్ హాస్పటల్‌కు పో.. అది చస్తే మళ్ళీ మాకు గొడవ' అంటూ విసుక్కున్నాడు.

'అయ్యా, డబ్బేగా.. అది నాకాడుంది. ఇదిగో బాబయ్యా' అంటూ సత్తిగాడు హడావుడిగా చిల్లర మూటని విప్పి ప్రక్కన పోగుపెట్టాడు.

'బాబ్బాబు.. యియ్యి తీసుకొని ఈ బిడ్డను బతికించండయ్యా' అని దీనంగా ప్రార్థిస్తూ, అక్కడే కూలబడిపోయాడు.

ఆక్సిజన్ సిలండర్ లాంటి డబ్బును చూసి ఆనందంగా లెక్క మొదలుపెట్టిన కాంపౌండర్ పెదవి విరిచాడు అవి చాలవన్నట్లు.

ఇంతలో లోపల్నుండి వచ్చిన డాక్టర్‌గారు ఇంటికి వెళ్ళబోతూ సత్తిగాడ్ని చూసి ఆగారు. కాంపౌండర్ శ్రీను గబగబా డాక్టర్ గారి దగ్గరకు వెళ్ళి ఏదో గుసగుసలాడాడు. అది వినగానే డాక్టర్‌గారు సత్తిగాడి వైపు తిరిగి 'ఏమయ్యా, నీకెన్నిసార్లు చెప్పినా వెళ్ళవా? అయినా.. ఇదేం ధర్మసత్రమనుకున్నావా? దారిన పోయే వాళ్లకు ఉచితంగా సేవలు చేయడానికి. అయినా నువ్విచ్చిన డబ్బు చాలదు. మరికొంత డబ్బు ఇచ్చి మాట్లాడు. అప్పుడు నీ బిడ్డ సంగతి చూద్దాం' అన్నారు కరుణించిన వాడిలా తన డబ్బు ఆశను తెల్లకోటు చాటున దాచుకుంటూ.

అది వినగానే అప్పటివరకూ ఏడుస్తూ బ్రతిమలాడ్తున్న సత్తిగాడిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. 'బాబూ.. తమరు గొప్పోల్లు బాబూ. పేగా సదూ కున్నోల్లు. తమరనుకుంటున్నట్టు యిది నా బిడ్డా కాదు, అది నా డబ్బూ కాదు. ఈ పిల్ల అనాథ. దెబ్బ తగిలి రోడ్డు మీద పేనాల కోసం గిలగిలా కొట్టుకుంటుంటే సూడనేక తీసుకొచ్చా. నా ఇంట్లో నా కూతురు తిండిలేక, నీరసాన రోగం వచ్చి సావుదాకా పోతందని నా వోల్లంతా రగతం నాగా పంచి ఇచ్చిన డబ్బు బాబూ ఇది. ముష్టోడ్ని నేను. నేనే ఇంత సాయం చేయా లనుకున్నానే. మరి పేనం కాపాడాల్సిన వాల్లు మీరు. మీరు చేసేదేంది బాబూ. ఇక్కడ కాకపోతే ఇంకెక్కడైనా బతికిత్తా. పిల్లను తీసుకపోతా' అని డాక్టర్‌కి నమస్కారం పెట్టాడు.

సత్తిగాడి మాటలకి డాక్టర్ గారి ముఖం వెలవెలబోయింది. సత్తిగాడి ఔన్నత్యం ముందు తానొక పిపీలికంగా మారుతున్న భావనతో తల దించు కున్నాడు. ఆయన మనసులో... లోపలి పొరల్లో నిద్రిస్తున్న మానవత్వం క్రమంగా మేలుకున్నట్లయింది. గబగబా వెళ్ళి ఆ పిల్ల నాడి పట్టుకుని పరీక్షించారు.

ఊహు.. అయిపోయింది. అప్పటికే అంతా అయిపోయింది.

ఆలోచనకు.. ఆశయానికి మధ్య లిప్తపాటు వ్యవధిలోనే అంతా పూర్తయిపోయింది. అప్పటివరకూ మృత్యువుతో పోరాడుతున్న ఆ పిల్ల ప్రాణాలు సంఘర్షణా వలయాలు దాటి అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

పాలిపోయిన డాక్టర్‌గారి ముఖం చూడగానే సత్తిగాడికి ఎవరూ ఏమీ చెప్పకుండానే అర్థమైంది జరిగిందేమిటో. కళ్ళలో నీరు ఆవిరైంది. ఆ పిల్ల ముఖం వైపు చూసాడు ఆఖరిసారిగా. 'పాపం తన కూతురు ఈడుదే.. ఇక నేదు' అనుకుంటూ కర్ర అందుకుని మెల్లగా బయటికి నడిచాడు.

అతని ముఖంలో భావాలు చదవడానికి ఎవరికీ భాష తెలియలేదు. స్వార్థం, ధనదాహం ముందు పోరాడి ఓడిన పేదరికపు నిస్సహాయతకి ప్రతిరూపంగా అతను కదలిపోతుంటే ఆపడానికి ఎవరికీ శక్తి మిగలక, చూస్తుండిపోయారు. ■